# సంపాదకునియుపోద్ఘాతము.

నామిత్రుఁ డొకదినమున నుదయముననే నాయింటికి వచ్చి "రాత్రి నాకుఁ జిత్రమగుస్వప్నము వచ్చినది. దానిని నీవు స్వప్నకావ్య మనునొకచిన్నగ్రంథము నేకాశ్వాసముగా వ్రాయవలయును. నేను నూతనముగ ఛందస్సు నేర్చుకొని యిప్పుడిప్పుడే గీతము లల్లుట కలవాటుపడుచున్నాను. గ్రంథరచనకు నాకింక సమర్థత తక్కువ. నాటకరచనయందు నీవుకొంత యలవాటు కలవాఁడ వగుటచే నుక్తిప్రత్యుక్తులసందర్భము నీవెఱుఁగుదు వని నిన్నిట్లు కోరితిని" అని చెప్పి స్వప్నము నామూలాగ్రముగా వెల్లడించెను.

నేనిట్లంటిని. "స్వప్నములో మనసు హేతుబద్ధమై యుండదు. స్వచ్ఛందముగ నుండును. నీస్వప్నములోఁ గొంతభాగము సహేతుకమై సహజమై సందర్భసమన్వితమై యున్నది. నాకచ్చటమాత్రము సందేహముగ నున్నది."

ఈమాటలు విని యాతఁ డిట్లనియెను. "కన్నెత్రాడు త్రెంపుకొని కాళ్లు గుదులుదీఱఁ బఱుఁగెత్తు నాఁదూడ, బొమ్మజెముడుకంపలవెంటఁ బొలములవెంటఁ బడుట యెంతసహజమో, రాజమార్గము వెంటఁ బాహాటముగా సూటిగాఁ బోవుటకూడ నంతసహజమే యగును. కావున నీవు సందేహింపవలదు.

అప్పు డాతనిమాటల కీయకొని యిటులంటిని. "నీవు నాతోఁ జెప్పినమాటలనే వ్రాసెదను. గ్రంథమున నాసొంత మేమియుఁ జేర్పను. నీవు నాయొద్దఁ గూరుచుండుము. ఇప్పుడే వ్రాసెదను."

అట్లీగ్రంథమును వ్రాసితిని. స్వప్నసంపాదకుఁడు నామిత్రుఁ

డు స్వప్నకావ్యసంపాదకుఁడను నేను. దీనిలోనియభిప్రాయములమంచిచెడ్డల కాతఁడే బాధ్యుఁడు. పాపము! ఆతఁడుమాత్ర మెట్లు బాధ్యుఁడు? స్వప్న మాతని కట్లువచ్చినది.

భారతకవులలో నిద్దఱీస్వప్నకావ్యమునఁ బాత్రములుగా వత్తురు. వారిమాటలవలన, వారినడువడులు పాఠకులు సులభముగా గ్రహింపఁగలరు. కాని వారెట్టినడత కలవారో మన మెఱుఁగము. స్వప్నసంపాదకుఁడుమాత్ర మాకవు లట్టినడువడికలవారని తలఁచినట్లు మనమెంచుటకుమాత్రము కొంత యవకాశ మున్నది. అదిసత్యమో యసత్యమో యెవరు చెప్పఁగలరు? స్వప్నముమట్టునకుమాత్రము సత్యము. వ్యవహారమందైనను సత్యమనకలీజనియీజగత్తు స్వప్నమని మహాజ్ఞాను లుపదేశించుచుండఁగా, మహాజ్ఞానినైననేను స్వప్నము సత్యమని చెప్పవలసివచ్చినందులకుఁ బాఠకులు నన్ను క్షమింతురుగాక.

20-3-18.
పీఠికాపురము.

పా. లక్ష్మీనరసింహారావు,
సంపాదకుఁడు.

శ్రీ

# స్వప్నకావ్యము.

## ప్రథమాధ్యాయము.

తొల్లి నిత్యమందాగ్నిబాధాసమాలబ్ధనిఖిలస్వప్నపరిపాటీవిచిత్రుం డగునామిత్రుండు, నాకుపదేశించినరీతిగా నేను నామిత్రులకు విన్నవించుకొనుస్వప్నకావ్యకథాక్రమం బెట్టిదనిన :—

రాత్రి పండ్రెండుగంట లయినది. తరువాతఁ బండ్రెండు దెబ్బలటో కాయింపైనది. కోటబురుజునుండి ‘ధమధమధమ్, ధమధమధమ్’ అని నౌబత్తుబజాయింపులు కప్పదాఁటులవలెఁ గర్ణములఁ బడుచున్నవి. వానినడుమను సన్నసన్నగా, మెల్లమెల్లగా సన్నాయివాదము తీఁగ ప్రాఁకినట్లు ప్రాఁకుచున్నది. ఈనాదద్వయమునుసుతిగా మద్దెలగా నంగీకరించి, గొంతు సవరించుకొని తూర మింటికెత్తి, వీధికుక్క, పైస్థాయిలో ముఖారిరాగ మందుకొని చౌకపుధోరణితో సంగీతకాలక్షేప మారంభించినది. కంటికలకవతె గాన మంటురోగమగుటచేఁ బ్రక్క సందులలోనిపాటగాండ్రు సరసకళాగానధోరణిని శక్తివంచనలేకుండ జవాబుసంగతులనుశరపరంపరలుగ విడుచుట వింటిని. ఈతోఁకనాటకులపాటలనాటకము విని వెగటుచెంది కాఁబోలుఁ జిరకాలమునుండి ప్రక్కయింటిపాడుదొడ్డిలోనుండి తీతువొకటి ‘టిట్టిట్ట్రీ’ యనివెక్కిరించుచున్నది. ఆహా! ఒకరిపాట యన్న నొకరికి నచ్చదుకదా! ఆహహా! ఒకరికవిత్వమన్న నొకరికి మొదలే నచ్చదుకదా! ఈయువకతవకలక్షణము—ఈదిక్కుమాలినయసూయ—ఒక్క మనుష్యజాతికిమాత్ర

మే కాదా? పశువులలోఁగూడ నీపాపమా? పక్షులలోఁగూడ నీప్రారబ్ధమా?

× × × × ×

రవగాలి వీచుచున్నది. అదివఱకాకాశముఖమునఁ బ్రకాశించుజలతారంచునీలిమేలిముసుఁగీగాలియూఁపున జాఱినది. నెత్తిపైనున్న చందురువంక నన్నుఁ జూడుమనుచున్నది. కొప్పులోనితారలు "కనిపట్టితిరా చంద్రునియహంభావము" ని కన్నుఁగీటుచున్నవి. గదిలోని యాముదపుదీపము 'మీాలెక్క నాకే' మనితల కొంచెమెగరవేయుచున్నది. "వింటిరా? ప్రపంచమున నహాన మెంతసౌభాగ్యముగ వర్ధిల్లుచున్నదో" యని నవ్యకవిత్వమున నుపాలంభగీత మొకదోమ సామగానము చేయుచున్నది.

× × × ×

దోమ కెంతబాగరు? మశక మెక్కడ? మహాజగత్తెక్కడ? తానుప్రపంచపరిపాటిని బరిహాసించునంతటిప్రజ్ఞ కలదా? ఏమివిరుద్ధత! అత్యల్పజంతు వెక్కడ? అధికవిజ్ఞానసంపన్నుఁ డగుమనుజుఁ డెక్కడ?

× × × ×

మనుజుఁడు మహాఘనుఁడా? ఇంతమనుజుఁడు నాపైనున్నను నేను నలిగితినా? నాకు లేనిఘనత యాతని కెక్కడినుండి వచ్చెను? ఆతఁ డొకయంశమున ఘనుఁడైన నేనొకయంశమున గట్టిదాన నగుదును. లోకమున ఘనుఁడుకానివాఁ డెవ్వఁడు?' అందఱుఘనులే! ఆతనిదృష్టిచే నంద ఱల్పులే! అయినను నాయల్పతయెట్టిదో యాతనిఘనత యేదో కనఁబఱతు" నని చిటుక్కున నొకచీమ వీఁపుపై నంటఁబొడిచెను. "ఆహా! నల్లికుట్టినది కదా" యని యదరిపడిలేచి ప్రక్కను దీపకాంతిచేఁ జూచుకొనఁగ నపరోక్షజ్ఞానసంపన్న మగుపి

పీలిక కానఁబడెను. తానే బ్రహ్మమగుమానిసి వీఁపుపైఁ బొడిచినది నల్లియో చీమయో తెలిసికొనలేకపోవుటెట్టిదని. 'టిట్టిట్టీ' 'టిట్టిట్టీ' యనుధ్వనితోఁ దీతువు తిరుగ వెక్కిరింప నారంభించెను.

అనేకకోటిభిన్నప్రకృతిసమాహారమైనయీసృష్టియంతయు నొక్కపరబ్రహ్మపరిణామమై యుండునా? కోటలో టంగున నొంటి గంట కొట్టినారు.

నిద్ర రాకుండ నున్నది. పట్టఁబోవుచున్ననిద్ర చీమ తనపొట్టను బెట్టుకొన్నది. చాఁపపఱచుకొని మఱియొకచోటఁ బండుకొంటిని. పయ్యెర వీఁచుచున్నది. పనసకాయకూరలో మోతాదైనయావమేళవింపువలె హితమైన, సరసమైన రవంతచలి, చల్లగాలితోఁ గలిసియున్నది. వేగముగానిద్రపోయి తీరవలయు నని నిశ్చయించుకొంటిని. కన్నులు గట్టిగమూసికొంటిని. మనసు స్తంభింపఁజేయ నుద్దేశించితిని. ఏనుఁగుతొండమును గదలకుండఁ జేయఁగలమా? పాదరసమును జలింపకుండఁ బట్టఁగలమా? గాలిస్తంభించినను రావియాకు కదలక మానునా? మనస్సు నరికట్టనుద్దేశముకూడ మనసులోనిచలనమే యగుటచేత భావచలననాటకమునకు భరతవాక్య మెన్నఁడుసిద్ధించును? అక్షినిమీలనముచేతనే యంతరంగశాసన మగునప్పు డంధుఁడద్వైతపరబ్రహ్మముకంటె నన్యుఁడా? నిదురబోవనున్ననాకీగొడవ యెందులకు? నాగొడవయే నాకక్కఱలేనప్పు డది యితరుల కెందులకు?

× × × ×

కనుఱెప్పలపై సరసమైన సహ్యమైన రవంతబరు వొక్కటి యనుభవములో నున్నది. కన్నులు దెఱచుట కూహాము లేదు. యత్నము లేదు. శక్తియు లేదు. ఈబరువు గురుతైనకొలఁది లోపలితిరు

గులాడికాలు లఘువగుచున్నది కాఁబోలు. పైయూటలమారిభార్యకు బంధము హెచ్చినకొలఁది కడఁద్రొక్కుట ఘనమగును గాదా?

× × × ×

మనసునకు మునుపటికట్టుపాటు కనఁబడదు. మునుపటిక్రమ మున్నట్లు కనఁబడదు. మునుపటియాజ్ఞానువర్తిత్వ మున్నట్లు కనఁబడదు. గురునిశ్చయము తీఱినకుఱ్ఱనివలెఁ బలుపోకలు పోవుచున్నట్లున్నది. కళ్లెము తెగినకంఖాణమువలె బహుభంగులఁ బోవుచున్నది.

× × × ×

మొండిచేఁతలో దాఁబేలు కనఁబడినది. దానినిఁ బట్టుకొనుటకుఁబోవఁగఁ గన్నులు గిఱ్ఱునఁ దిరిగినవి. ఒక్కత్రుటికిఁ గన్నులు విప్పునరికి శూర్పణఖను కౌఁగిలించుకొని దానిభర్త కాఁబోలు బాఱెడు బాఱెడున కొక్కగట్టిముద్దు పెట్టుకొనుచున్నాఁడు. ఆహా! విశిష్టాద్వైతులసాపాటు చూడఁగూడదు కదా యని పక్కకు మఱలునరికి ‘‘టూలేటు’’ ముద్రితోఁగూడఁ బదునొకండుముద్రలను లేఖాలయములో పెడిపెడి యని ముద్రించుచున్నారు.

× × × ×

గీరుగారనుచు నాకసమునఁ గొంగలబార గపడినది. అంతలో దడదడ వడగండ్లవాన గుఱిసినది. మింటిపైఁ గుంచముకంటె పెద్దతూటు పడినది. అంతలో నదేమొ యట్టెయట్టె యాకాశము క్రిందకు వ్రాలినది. ఆరంధ్రములోఁ దలఁదూర్చితిని. అంతలో రంధ్రమంసన్న సన్నబడినట్లు కనఁబడినది. తల తప్పించుకొనుటకుఁ బ్రయత్నించుచుండఁగా ఢామనుధ్వని కాలిక్రింద నైనట్లుండెను. రప్పుమని యాకాశమొక్కసారి యుబ్బెత్తుగాఁ బైకి లేచెను. నేనుగూడ దానితోఁ బైకిఁ బోయితిని.

× × × ×

ఓ! బంగారుభవనములు! పచ్చలతోటలు! వెండినీటినదులు. ఆహా! అద్భుతముగ నున్నది. మనసూర్యుఁ డంతకాంతితోఁ జంద్రుఁడై యట్టిచంద్రులు వేవురు పగలు రాత్రికాని సమయమునఁ బ్రకాశించిన నెట్లుండునో యక్కడనట్లున్నదని నేననుకొంటిని. దివ్యపుష్పపరిమళములు ఘ్రాణతర్పణ మొనర్చుచున్నవి. బంగారుతామరపువ్వులలోనిపరాగమున నిండినమందాకినీనీరముపైనుండి వచ్చినగాలి కాఁబోలును స్పర్శసుఖ మిచ్చుచున్నది. దేహమునకు మునుపు లేని పుష్టి బుద్ధికి మునుపు లేనిచాకచక్యము కంటికి మునుపు లేనినైశిత్యము కలిగినట్లు కానవచ్చెను. తిరుగ దగునంతవఱకుఁ బట్టనములోఁ దిరుగుటకు నిశ్చయించుకొని యొకవీధివెంటఁ బోవుచుంటిని. అక్కడఁగొందఱు మునిబాలకులు గూర్చుండి ప్రాఁతగోముఖములను దులుపుచుఁ రుద్రాక్షలనుగ్రొత్తత్రాటఁ గ్రుచ్చుచు ‹నోన్నమశ్శివాయ యనుమంత్రము నుచ్చైస్స్వరమునఁ బఠించుచున్నారు. మఱియొకవీధినిఁ బోవఁగ నొక్కయత్యంతసుందరభవనమగపడినది. దానిద్వారమునొద్ద స్వర్ణవేత్రహస్తులై యుద్ధలు «జయా! అసురాంతకసార్వభౌమా! జయా! అమరావతీనాథా! జయా! అహల్యామానచోరా! యని హెచ్చరించుచున్నారు. అప్పు డీపట్టన మేదో తెలిసినది. అనేకపాపకర్మములొనర్చిన నేను స్వర్గమున కెట్లురాఁగలిగితినని సందేహించితిని. ఇది స్వప్నమేమో యని వెంటనే కొంత నిశ్చయించుకొంటిని. సకలవైభవసంపన్నమై మహానందదాయక మగునాదివ్యదర్శనము ముందు పైఁబూర్వపక్షసిద్ధాంతములు పరాకుపడితిని. మఱియొకవీధినిఁ బోవుచుంటిని. అక్కడఁ బెద్దద్రాక్షపందిరి కనఁబడినది. దాని క్రింద నొక్కదివ్యమంగళస్వరూపిణి యగుముప్పదియేండ్లకాంత కనఁబడినది. కాని దూరదృష్టి నామె బహుదురవస్థలో నున్నట్లు తెలిసి

కాని చేతనైనసాహాయ్య మొనర్పవలయునని సమీపించితిని. ఇద్దఱు శ్వేతశరీరధారులు (జర్మను లని యనుకొంటిని) నిద్దఱుతురకలు గలిసి యాదంగమజాంబూనదవిగ్రహమును దెఱపిలేకుండ నూపిరి విడువ కుండ మూతికిమూతికిఁ దలవెండ్రుకయంతయైన నెడము లేకుండము ద్దు పెట్టుకొనుచున్నారు' అప్పుడొకతురక నన్నుఁ జూచి „ జా రే !" అని కేకవైచెను. ఇంతలోఁ గొంచెము దూరమునఁ బచ్చఱాతిబండ పైఁ గూరుచుండినయెవ్వరో నన్నుఁ జేసన్న చేయఁగ నాతనియొద్దకు బోయితిని. అతఁడు వృద్ధుఁడు. సోమపాన మొనర్చినయాయజాకుఁడు వలెఁ గానఁబడినాఁడు. చంకను దర్భాసనమున్నది. చేత నుదకసహితమగుకొమ్ముచెం బున్నది. అతఁడు నాతో నిట్లనియెను. 'నాయనా! నీవుగూడ రంభాపరిరంభమునకే వచ్చితివి కాఁబోలు. నేను బెద్దవాఁడను. చెప్పినమాట విని యిప్పుడుమాత్రము తొందరపడకు. ఈగడ్డా లఘుర్గణ మేదో కడతేరినతరువాత మనమిద్దఱము కలిసి దానియొద్దకుఁ బోవుదము. ఎవ్వరెన్ని చెప్పినసరే ఆ రంభగారికిమాత్రము బ్రాహ్మణునిమీఁదనున్నభక్తి పరజాతిమీఁద లేదు. అయినను నాయనా నీవెన్నిసారులు సోమపానము చేయుటచే నిక్కడకు వచ్చితివి. ఆమాటలువిని 'అయ్యా! నేనేకర్మము నెఱుఁగను. రాత్రిభోజనములోఁ దెలకపిండిచిక్కుడుకాయకూర రెండుమారులుకలుపుకొంటిని. ఆకూరపరిమళ మిప్పటికి నోరూరఁజేయుచున్నదని నేనంటిని. 'చాలులే! చాలులే!' ఇఁకఁ జెప్పకు. నాకు నశ్లే యున్నది. చిక్కుమాలినసంస్కారాలు స్వర్గములోనికివచ్చినను వదలవుగదా' యని నిట్టూర్పువిడిచి యాసోమయాజి పలికెను.

అంత నేను మఱియొకవీధికిఁ బోగ నక్కడ నొక్కచెట్టుక్రింద పాలఱాతిపలకపై నిద్దఱు గూరుచుండిరి. నేను వారియొద్దకుఁ బోయి

చూచితిని. వారినిఁ జూచుటతోడనే మునిశిష్యులకైనను నమస్కరిం
పనివాఁడను సాష్టాంగపడ మనసయ్యెను. వారు నన్ను దీవింపలేదు.
నావంకఁ జూడలేదు. అంధులవలెఁ బూజ్యులవలె—వారు నాకుఁ
గానఁబడుటచేత నక్కడఁ గూరుచుంటిని. వారిట్లు మాటలాడుకొను
చుండిరి.

ఒకఁడు :—ఏలాగుననైన దైవకృతి దైవకృతియే మనుజకృ
తి మనుజకృతియే.

రెండ—నేనైనను భారతము రాజరాజనరేంద్రునకుఁ గృతి
సేయకయే పోదును. ఆయన ప్రీత్యాసక్తిగా నంతప్రార్థించినప్పు డీ
యకుండుట బాగుగా నుండదని యట్లు చేసితిని. నేనీయకపోయిన
మఱియెవ్వరైన నిచ్చియుందురు. ఆప్రభువునకు లోపము లేదు. ఆం
ధ్రభారతము పైకిరాకనుపోదు. కాని నేను భారతకవి నన్నమాట
నాకుమాత్రము దక్కియుండదని నావిష్ణుఃపృథ్వీపతియన్న న్యాయము
చేత మనస్సును సమాధానపఱచుకొని యట్లు చేసితిని.నీవు నాకంటె
నదృష్టవంతుఁడవు. నరకృతిబాధ లేకుండ దాఁటుకొని వచ్చితివి.
అప్పుడు వారిలో నొకఁడు నన్నయభట్టని రెండవయాతఁడు తిక్కన
సోమయాజి యని నేననుకొంటిని.

తిక్క—ఏది? నాకుమాత్రము నరకృతి లేనియదృష్టమేది?
ఆకక్కుఱితి మానిర్వచనోత్తరరామాయణమునఁ దీరినదికాదా?

నేను—మహాకవులారా! ఆవిషయమున బమ్మెరపోతనామా
త్యున కందినవా రెవ్వరు పూర్వులలో లేరు.

తిక్క—ఆసంగతి కర్ణాకర్ణిగా నిక్కడవారివలన వినియుంటిమి.

నన్న—వీ రెవ్వరు?

నేను—నన్నయభట్టుగారూ! మీ రేనదిపవిత్రోదకముద్రా

వితిరో యానీవు నేనును దాఁపినవాఁడనే. నేనాంధ్రుఁడను. మీరేప ట్టనమున భారతకృతిరచియించితిరో యాపట్టనమున నేను వసించు వాఁడను.

నన్న—అలాఁగా! నాయనా! సంతోషమే.

తిక్క—భూలోకములోనివిశేషము లేమయినఁ జెప్పెదవా? వించుము.

నేను—అభ్యంతర మేమి? మొదటిది. ఇఁక మీభారతము పైనకు మారదని నానమ్మకము.

తిక్క—ఎందుచేత?

నేను—సంస్కృతభారతమును నేనెఱిఁగినంతవఱకు ముప్పేరాంధ్రీకరించుచున్నారు.

తిక్క—మావలెనే కొన్నిపర్వము లొకరు కొన్నిపర్వము లొకరు చేయుచున్నారా?

నేను—అట్లు కాదు. ఎవరిమట్టునకు వారు పూర్తిగనే చేయుచున్నారు.

తిక్క—వారు మాకంటె గట్టికవులా యేమి?

నేను—ఘటములు పూర్తియగువఱకు గట్టియో యొటియో యెట్లు తెలియఁగలము?

తిక్క—ఆదేమిమాట? "మదమాతంగతురంగకాంచన X" యనునన్నయభట్టారకునిపద్య మొకటి సర్వకవులకుఁ గవితాపరీక్షార్థమై పంపఁబడియుండలేదా? దానికి వర్ణము వేసి తిరుగ దానిని మేము పంపియుండ లేదా? కవిత్వఘునతకనిపట్టుట కొకపద్యము చాలదా? పదివేలపద్యములలోనైన యథార్థకవిత యుండకపోవచ్చును. సహజకల్పనాసంయుక్తమై సందర్భశుద్ధిసహితమై తేజస్సమన్వితమై యొక్క

పద్యమైన సరేకాక యొక్కవాక్యమైననసరే కవిత్వ మనిపించుకొనును గణబద్ధమైనకావడిగ్రంథమైనను రసహీన మైనయెడలగద్యమనిపించు కొనును గాని కవిత్వ మనిపించుకొనదు.

నన్న—తిక్కయజ్వగారూ! ఇన్ని మాట లెందులకు? ఈకాలములోనైన భూమియందు గొప్పకవు లుండవచ్చును. కాని నాయధిక్షేపణ మేమనఁగా మంచియో చెడ్డయో మేము చిరకాలముక్రిందఁ గష్టపడి వ్రాసినగ్రంథమును దిరుగ నొకరు వ్రాసిన వినియోగ మేమున్నది? మేమేమిలోపము లాచరించితి మని మఱియొకరు వ్రాయవలయును. ఇట్లు చర్వితచర్వణముగా గ్రంథములు వ్రాసినయెడల సారస్వతాభివృద్ధి యెట్లగును? ఒక్కొక్కగ్రంథము సరస్వతి కొక్క ముందడుగుగా నుండవలయును. అంతేకాని గ్రంథరచనయం దీగుడుగుడుగుంచము లెందులకు? కవితానది యసాధారణవేగమున ముందునకుఁ బ్రవహింపవలయును గాని సుడిగుండములలో గిఱ్ఱుఱఁదిరిగిన యెడల దైర్ఘ్యమునకు వైశాల్యమునకు నవకాశమేది? కావున నాధునికులయాంధ్రభారతరచన నామనస్సునకు బాగుగాలేదు.

నేను—భట్టోజీగారూ! మీకాలములోనే పుట్టినభారతమును మీరు సహింపలేనిమహానుభావులు. ఇప్పటిభారతమును సహింతురా?

నన్న—అట్లనుచుంటి వేల?

నేను—అథర్వణాచార్యులవారిభారతము మీభారతముకంటె బాగుగా నుండుటచేత దానికిఁ బ్రఖ్యాతిగౌరవము గలుగకుండ దానిని ధ్వస్తపఱచినవారు మీరేకారా?

నన్న—అయ్యో! నాపై భూలోకమున నిట్టియపవాదమున్నదా? యథార్థము చెప్పెదను. వినుము. ఆకాలమునాఁడు జైనమత మడుగంటుచున్నది. బ్రాహ్మణమతము తిరుగఁ బైకి వచ్చుచున్నది.

అప్పటిప్రభువు బ్రాహ్మణపక్షపాతి. అథర్వణుఁడు జైనుఁడు. అందుచే జైనమతావమానమునఁ బ్రభువే యాతనికృతి నందుటకు నిరాకరించినాఁడు. నేనేదోవ మెఱుఁగను.

తిక్క—అనవసర మైనయీపూర్వగాథ లేల?

నేను—తిక్కన్నగారూ! మీరు మఱింత మహానుభావులు. పూర్వగాథలు వినుటకు మీకిప్పు డిష్టముండునా? నన్నయ్యగారు జైనమతగ్రంథమునే రూపుమాపెనుకాని మీరనేకజైనులను రూపుమాపినారు.

తిక్క—ఔను. ఊరకేనా? వాదమునఁ—జావఁగొట్టి జయపత్రిమంది—మాగంటమునకుఁ గత్తికి నొక్కటే వాడి. అయిన నీగోడవయేల? మాభారతమును ధ్వస్తపఱచుచున్నట్లు మాతాతగారి రామాయణమునుగూడ నెవ్వరైన ధ్వస్తపఱచిరా?

నేను—ఒకరా? నల్గురు. రామాయణమంతయు దృశ్యప్రబంధముగా సాగఁదీసిన పేదపాట్లాలక్రింద సవరాలక్రింద తేటగీతలక్రింద తెయితక్కలక్రింద లాగిన పెద్దమనుష్యుఁడుమఱియొక్కఁడున్నాఁడు.

నన్న—రామాయణముసంగతి వేఱు. అదియెందఱువ్రాసినను వ్రాయఁదగినదే. దానిమాహాత్మ్య మట్టిది. సోమయాజిగారూ! ఏనిర్వచనమో యేయుత్తరమో వ్రాసి మీతాతగారిది మీరే కొంత ధ్వస్తపఱచినారుకాదా? ఇఁకఁ బైవారి నధిక్షేపించుట యెందులకు? నేనుమాత్రము రాఘవాభ్యుదయము వ్రాయలేదా? దానిని ధ్వస్తపఱచుటకే మీతాతగారు రామాయణము వ్రాసినారా యేమి? బాగున కెక్కడికి? ఓగున కెక్కడికి? బొత్తుగా బాగులేక మిక్కిలితీసికట్టుగా నున్నప్పుడుగాని యేగ్రంథమును దిరుగ వ్రాయుటకు వేఱొకఁడు పూనుకొనఁగూడదు. ఏమి! సోమయాజిగారూ! నేఁజెప్పినమాట న

త్యమే కాదా ?

తిక్క—మీరుసత్యముమాత్రమే చెప్పినారుకాని నేను మీర న్నసత్యమును దైవముఖమునఁ జూచి యాచరించితిని. మీరు రెండుప ర్వములనరవ్రాసి విడిచినతరువాత విరాటపర్వమునుండియే నేను భా రతమును వ్రాయలేదా ? మీరువ్రాసినదాని నేమైనఁ దాఁకితినా ? పదునైదుపర్వములు గుక్కత్రిప్పకుండఁ జెప్పి వ్రాయించినవానికి మిగిలిన మూఁడుపర్వము లేమిలెక్క ? మీరు వ్రాసినభాగమునుగూడ నేనేవ్రాసియుండినయెడల మీభారతమున కీప్రపంచమునఁ బ్రసక్తి యుండునా ?

నన్న—అ! అ! అంతమాటయెందులకు ! నాయనా ! ప్రసక్తి యుండునో యుండకపోవునో— జరుగనిసంగతుల పర్యవసానముతోఁ బనియేమి ? నాకుఁ బ్రాప్తి లేకపోయినది. కాని మిగిలినపర్వములు నే నుమాత్రము వ్రాయలేనివాఁడనా ?

నేను—మహాకవులారా ! మీరిద్దఱు సములే. మీకన్యోన్య మత్సరముతోఁ బనిలేదు. తిక్కన్నగారికవిత్వములోఁ గొంచెము పె ళుసుదనము, నన్వయకాఠిన్యము, శబ్దములబిగియు నుండును. నన్న యగారికవిత్వములోఁ గొంచెము లఘుత్వము, వదలుతనము, అనవ సరసంస్కృతపదభూయిష్ఠత గలవు. గుణము లిద్దఱకవితలోను సమా నముగనే యుండును.

తిక్క—నీవు మమ్ము భూషింపవలదు. దూషింపవలదు.

నేను—చిత్తము. చిత్తము. దూషణభూషణవిషయములలోఁ దరువాత మనవి చేసికొందును. నన్నయగారూ ! మీరెక్కువవారా? నారాయణభట్టెక్కువవాఁడా? ఈసందేహము కొంత బాధించుచున్నది

నన్న—అట్లేలయడిగితివి ?

నేను—"పాయక పాకశాసనుఁడు భారతఘోరరణంబునందు నా, రాయణునట్టు" అనియున్నది. కృష్ణుఁడే క్రీడిప్రాణముకదా! సైంధవవధదినమున కృష్ణుఁడు చక్రివడ్డుపెట్టకుండినయెడల క్రీడిపస యెట్టిదో తెలిసియుండును. పార్థసారథియే లేనియెడల పరశురామశాసకుఁడైన తాతగారొక్కదినముననే పార్థునితలప్రాణము తోఁకవఱకు వచ్చునట్లు చేసియుండును. ఇంతయెందులకు? నరనారాయణులు రథముదిగినవెంటనే యదివఱకుఁ గృష్ణభగవానుని మాహాత్మ్యమున నడఁపఁబడియున్న బాణాగ్నిచే నొక్కసారి రథమంతయుఁగాలిపోలేదా? అదియటుండనిండు. కృష్ణనిర్యాణమైనతరువాత నీసవ్యసాచి గోపికల నేమాత్రముకావఁగలిగెనో యెఱుఁగరా? కృష్ణుఁడు లేనికవ్వడి గవ్వకన్నఘనుఁడా? ఈయుపమానమువలన నారాయణభట్టుముందు మీరుకూడ నల్లేమోయని తోఁచుచున్నది. క్షమింపవలెను.

తిక్క—(తనలో) వ్రాసిన యీరెండుపర్వములనఱకే మఱి యొకని సాహాయ్య మీకవికిఁ గావలసివచ్చియుండఁ బదునెన్మిదిపర్వములు తానేవ్రాయఁగలనను ప్రతిభ లేల?

నన్న—నారాయణభట్టు నాసహపాఠి. మహాబుద్ధిశాలి. నాయనా! ఒక్కమాట. మనసహపాఠిని మిత్రుని గ్రంథరచనయందు మనకు సాహాయ్యముచేసినవాని నెప్పుడుకూడ మనకంటె ఘనుఁడనియే వర్ణించుచుండవలయును. నాయనా! తోడికవిప్రాణము సంతోషించుట కింతకంటె సురుచిరమైనమార్గ మున్నదా?

నేను—సురుచిరమేమో నేనెఱుఁగనుగాని శుద్ధవైదికముమాత్ర మగును, ఇందువలనఁ గవితారతమ్యము కప్పుపడిపోవును.

తిక్క—ఆమాటయసత్యము. వివేచనాశక్తియున్న విమర్శకుఁడొక్కపద్యముతో నెవఁడుఘనుఁడో కనిపెట్టఁగలఁడు. లక్ష చెప్పేఁడు.

కోటి చెప్పఁడు. ప్రస్తుతకవు లింకఁబదునాలుగుభారతములు వ్రాయ నిండు. అవియన్నియు మాభారతముముందుఁ బ్రాణహీనములై పోవలసినదే కాని యన్యథా కాదు. మాభారత మొకటియే యాచంద్రార్క ముగా నిలువఁదగినదని నానిశ్చితము.

నేను—ఆమాటయుఁ గొంతనిజమే కాని యథర్వణాచార్యుల భారతము దొరికినయెడల మీభారతముమాత్రము తలక్రిందియెత్తుల కంటె నెక్కువయుపయోగపడదేమోయని భయపడుచున్నాను.

తిక్క—నీమొగముచూడఁగా నీవు భారతమెన్నఁడుచదివినట్లే యగపడదు. నీబుద్ధికిఁ దగినట్లే మాటలాడుచుంటివి. చాలు! ఇఁక విశేషవాగ్వ్యయముతోఁ బనిలేదు.

నేను—మీకు నేను శ్రమమిత్తును. నన్నయతాతగారూ? నారాయణభట్టుశాసనమువ్రాసినవారు మీరేకారా? అతని కట్టియు పకృతికిఁగూడఁ గారకులు మీరేయైయుందురుకదా! ప్రభువు మీకే యగ్రహారమిచ్చినట్లెక్కడను గనఁబడదేమి?

నన్న—కనఁబడదా? వెదకినవారేరి? వెదకించినవారేరి? ప్రభువులలో నేమహానుభావులిందునుగూర్చి విశేషోత్సాహముతోఁ బని చేయుచున్నారో చెప్పు.

నేను—ఆంగ్లేయప్రభువు లిందునుగూర్చి శ్రమమొనర్చుచునే యున్నారు.

నన్న—నాయనా! ఆంగ్లేయప్రభువులెవ్వరో గొప్పవారేయై యుందురు. వారుపరరాజులని వినుచున్నాను. దేవతార్చనపేటికలోఁ బెట్టికొనిపూజించు శాసనములు సద్గ్రంథములు దేశీయప్రభువుల కిచ్చెదరుకాని పైవారి కేలయిచ్చెదరు? స్వదేశప్రభువు లెవ్వరైన మహోదారులు, భాషాభిమానులీమహాకార్యమునకుఁ బూనుకొన్నచో

భావిసారస్వతచరిత్రాంశములపై సూర్యప్రభానిభమైన దీప్తి పడుట కేమైన సందేహమా ?

తిక్క—నిజమే. దేహముబాసి యిక్కడ కప్పుడప్పుడువచ్చుచున్న పండితులను కవులను నేను గలిసికొని భూలోకవార్తలఁ గనుగొనుట నాకలవాటు. ఇప్పుడు కవులు తండోపతండములుగ నున్నారఁట ! కవిత్వముచెప్పలేనివాఁ డొక్కఁడును లేడఁట ! వీరందఱు గ్రంథములు వ్రాయుచున్నారఁట. కాలమెప్పుడో యీపనికిమాలిన గ్రంథములను నశింపఁజేయునని యూరకుండఁదగదు. పూర్వకవులతో సమానులగుకవు లీకాలమునఁ బుట్టుట యసత్యము. యథార్థకవిత్వపుఁగాలము దాఁటిపోయినది. ఇది విమర్శకశకము. ఈకాలప్రభువులిప్పుడు కవులనుబోషించుటకంటె విమర్శకులను బోషించుట మిగుల భాషోపయోగకరము. ఇప్పుడుబయలుదేరుచున్న పనికిమాలినగ్రంథములను భంజించుటకు విమర్శకు లనేకులు కావలయును. ఎలుకలు విశేషముగాఁ బెఱిగి మహామారిని వృద్ధిచేయుకాలమున నెన్నియెలుకలబోనులను జాగ్రత్తపెట్టిన నంతమంచిదికాదా? ఇది యిప్పటిప్రభువుల కర్తవ్యము.

నేను—బాగుగానేయున్నదికాని మంచియెలుకయేదో మారియెలుకయేదో తెలిసికొనకుండ నన్నిటినిఁజంపినయెడల బాగుగనుండునా ?

తిక్క—నేఁజెప్పినది నీకుబోధయేకాలేదా ? విమర్శకుఁడుచేయుపని యదియేకాదా?

సశేషము.

నేను—చిత్తము. చిత్తము. నన్నయ్యగారూ! మఱియొక్క సంగతి. నన్నయభట్టీయము మీరువ్రాయలేదని యిప్పుడొక్క సిద్ధాంతము క్రొత్తగాఁ దలచూపినది. వింటిరా?

నన్న—ఆఁ! ఆఁ! నన్నయభట్టీయము నన్నయభట్టు వ్రాసి యుండకపోవుటెలాగు? ఏమినాయనా? నాకుబోధపడలేదు. జైమినిసూత్రాలు జాబాలి వ్రాసియుండునా?

నేను—బ్రహ్మసూత్రములు వ్యాసుఁడువ్రాసినట్లే-నన్నయభట్టీయమును--ఆదేయాంధ్రశబ్దచింతామణిని-ఎలకూచిబాలసరస్వతి వ్రాసెనని సిద్ధాంతీకరిం—చు—చు—న్నా—

తిక్క—నంగినంగిమాటలాడెదవేల? ఎవరాసిద్ధాంతీకరిఁచుచున్నవారు. స్పష్టముగా విడఁగొట్టి చెప్పరాదా?

నేను—చెప్పినయెడల నేమిలాభము? మీరు వారినిఁ దిట్టఁగలరా? కొట్టఁగలరా? మానసనష్టమునకు వ్యాజ్యము తీసికొనిరాఁగలరా?

నన్న—(నవ్వుచు) నాయనా! నీకానందేహ మక్కఱలేదు. మాతిక్కనసోమయాజిగారినడుమ నంతపనియుఁ జేసినారు. సోమయాజిగారూ? చెప్పుమందురా?

తిక్క—నాకేమియు భయములేదు. సందేహములేదు. నానడతలోఁగాని పాండిత్యములోఁగాని కవిత్వములోఁగాని నలితొలిలేదు. నాకుటొంకెందులకు? కడుపులోఁ జల్లగదలకుండ నొకచోటఁ గూర్చుండఁదలఁచి గంటముచేతఁబట్టితినిగాని కత్తియే పట్టినయెడల రణతిక్కనలిద్దఱుండియుందురు.

నన్న—అబ్బాయీ! నీపేరేది?

నేను—రామనాథరావు. అయ్యా! మీరుపెద్దలైనను నకు

పదియేండ్లవాఁడనై నన్నుఁ గేవలమజ్జుని సంబోధించినట్లబ్బాయీ! యని పిలువన్యాయమా?

నన్న—నాయనా! తప్పులేదులే! నీవునన్నుఁ 'తాతగారూ' యనిపిలుచుటచేత ని 'న్నబ్బాయీ' యని పిలిచితిని. అదిగాక నీ కంటె నేనెంతవృద్ధుఁడనో నీవెఱుఁగుదువా?

నేను—అదికూడ మీారే సెలవిచ్చెదరుగాక!

నన్న—ఇప్పటిశాలివాహనశక మేదో తెలియకుండ నేనెట్లు చెప్పఁగలను? మీాసంవత్సరపులెక్కలిక్కడ మాకెట్లు తెలియును?

నేను—ఇప్పటిశకము 1839.

నన్న—అబ్బ! అట్లయిన నీకంటె నేను దాదాపుగా 850 సంవత్సరములు పెద్ద.

నేను—అలాఁగా! సోమయాజిగారుమీారు దాదాపుగా సమవయస్కులా?

నన్న—ఆయన నాకంటెఁజిన్న.

నేను—ఏమాత్రపుఁజిన్న!

నన్న—అది నేనెట్లుచెప్పఁగలను? ఏమింతిక్కన్నగారూ!

తిక్క—దాదాపుగా 225 సంవత్సరములుచిన్న.

నన్న—సరే! ఈగొడవకేమి? రామనాథరావూ! ఇప్పటివఱకు నాకాసంగతితలఁచుకొనఁగ నవ్వు వచ్చుచున్నది. నాకు లౌకికము తక్కువయగుటచే నేనెవ్వరితోడను విశేషించి భూలోకవార్తలఁగూర్చి ముచ్చటింపను. తిక్కన్నగారియొద్దకుఁ దఱచుగా నిప్పుడు స్వర్గవాస్తవ్యులగు భూలోకపండితులు వచ్చువారుగలరు. ఆనదుమను గారివ్యావాదియొకరు–బుద్ధిశాలియఁట—యిచ్చటకు వచ్చిరి. నా యొద్దకు మొదట వచ్చి మీాతోఁగొన్నిసంగతులు ముచ్చటింపవలయు

వని నన్నుఁగోరిరి. “నాయనా! నేనువైదికుఁడను. కుడిప్రక్కనందు లోఁదిక్కనసోమయాజిగారున్నారు. వారియొద్దకుఁ బొమ్మని చెప్పితిని. ఆయన యక్కడకుఁబోయి “సోమయాజిగారూ! మీరు భారతమంతయు మొదట గ్రామ్యభాషలోనే వ్రాసినమాట సత్యమేకాదా? తరువాత పండితులు తెలివితక్కువచేత శుద్ధమైన మీవ్యావహారికభాషను దిక్కుమాలినగ్రాంథికభాషలోనికి మార్చిరికాదా?” యనిపలికెను. సోమయాజిగారుగ్రుద్ధులై “నేనుభారతమును గ్రామ్యభాషలో వ్రాసితినా? నాభాషను దరువాతిపండితులు దిద్దుటకు సమర్థులా” యని గంటముతో నొక్కపోటూతనిని బొడువఁబోవునరికాతఁడు చల్లచల్లగ జారిపోయి తరువాత నెన్నఁడిక్కడకు రాలేదు. నేనైనను దిక్కనగారిచ్చటనుంటచే నీతోనింతవఱకు మాటలాడుచున్నానుగాని మఱియొకటి కాదు.

నేను—ప్రస్తుతభారతకవులు ముగ్గురున్నారని నేనింతకుముందు మనవిచేసితినే. వారిలో నొక్కరు—

తిక్క—గట్టిగఁజెప్పరాదా? సందేహమేల?

నేను—వారిలోనొక్క రివ్వడిగ్రామమునసే యున్నారు. వారు ఋషివిగ్రహులు. పరమయోగ్యులు. భారతము తెలిఁగించుతలఁపుతప్ప వారికి మఱియొకతప్పేమియు లేదు. అట్టితప్పైనను మీకు—

తిక్క—వారు మనయొద్దకు రాకపోవుటయేల?

నన్న—ఈభారతపుబాధచేతనే మిమ్ముఁజూచుటకు సందేహించిరనుకొందును. సరే! ఎవరు? ఎలకూచిబాలసరస్వతియా? నన్నయభట్టీయమును వ్రాసినది? ఇంతటితో సరిపెట్టిరా? ఇబ్రహీంసాహేబు వ్రాసినాఁడనియనకపోయిరా? వారికేమికారణములున్నవి?

నేను—ఒకటా? రెండా? ముప్పదిరెండుకారణము లున్నవి.

నన్న—నాయనా! వినుటకుఁ గుతూహలముగానున్నది. కొన్ని చెప్పుము.

నేను—నాకేమియుఁ దెలియదయ్యా!

తిక్క—ఇదిగో! ఇట్టినగముసగముమాటలు చెప్పినయెడల జాగ్రత్త!

నేను—విమర్శవిషయములు నాకేమియుఁ దెలియవు. ఆవిషయముల నాకభిరుచియు లేదు. కాని లోకమున వాడుక యిట్లున్నదని చెప్పినాను. కోపమా?

నన్న—నాయనా! తిక్కన్నగారిహృదయము సుధాకలశము వంటిది. వాక్కులే కొంచెము కటువుగానుండును. సందేహింపకుము. నీయిష్టానుసారముగఁ జెప్పఁదగినది చెప్పుము.

నేను—మీయొద్ద నెంతస్వైరమైన మాటలాడవలయుననియేయున్నది కాని సోమయాజిగారినిఁ జూడ భయము వేయుచున్నది.

తిక్క—నీకుభయమేల? నీపైనాకేమివైరమా? నీవు నిస్సందేహముగా మాటలాడుము. నీదూషణభూషణములను మేము గణించువారము కాము.

నేను—ఆసంగతియేయిప్పుడు నేను జెప్పఁదలఁచియుంటిని. ఈమాటనే మీరింతకుముందంటిరి. మాదూషణభూషణములు మీకు లెక్కలేకపోవచ్చును.

తిక్క—వచ్చునేమి? నిశ్చయముగా లేవని చెప్పుచుండలేదా?

నేను—లేకపోయిన మీకీవాద మెందులకు? భారత మెందఱు వ్రాసిన మీకేమి? ఇప్పటికవి లభములైన మీకేమి? మీభారతము నిలువకపోయిననైన మీకేమి? న్యాయముచేత—పిష్టపేషణముగా వేలకొలఁది గ్రంథములు బయలుదేరుచున్నవి. తొమ్మిదాంధ్రశాఖఁ

తెలములు. ఆరునొకటి యాంధ్రోత్తరరామచరిత్రములు. పదుమూడు తెలుఁగుమేఘసందేశములు. ఇటులే యెన్నియో యిప్పటివారికి జంకుకొంకులేదు. ఈజలోదరబాధ, యీబోదకాళ్లసౌభాగ్యము నీయుబ్బుకామిలలు సరస్వతీదేవికిఁ దగవు. ఈవ్యాధి శీఘ్రముగా నివారణకావలసినదే. మీరుచెప్పినట్లు విమర్శకభిషక్సార్వభౌముల శల్యతంత్రమాహాత్మ్యమునఁగాని తిరిగి యాంధ్రవాణికి రక్తశుద్ధి, పుష్టి, తేజము, బలము, కలుగవు. కాని భూషణతిరస్కారములతోఁ బొత్తుగాఁ బనితేని పరమవేదాంతులైన మీకీగొడవలెందుకొఱకని నేనడిగినాను.

తిక్క—నాకొఱకుఁగాదు. మీకొఱకు. భాషకొఱకు. దేశముకొఱకు. సర్వసంగపరిత్యాగియైన సన్యాసిమాత్రము లోకసంగ్రహార్థము కర్మమాచరింపవలయునుగాదా? ఇదియేమి? ప్రఖ్యాతపండితులగు బౌద్ధులతో జైనులతోఁ బ్రబలవాదములొనర్చిన నాకు నిరక్షరకుక్షివగు నీతో నేఁడు రాద్ధాంతసిద్ధాంతప్రారబ్ధము గలిగినదేమి? చాలుచాలు.

నన్న—రామనాథశాస్త్రూ. నీవు చెప్పఁదలఁచినదేదో మానివైచినావు.

నేను—మా దూషణభూషణములు మీకు లెక్కలేకపోవచ్చును గాని మీదూషణభూషణములే మాకు నిత్యము లెక్కగానున్నవి.

తిక్క—అదేల?

నేను—పూర్వము నియోగివైదికవైరములు రాజకార్యములందేకాని యిప్పుడు సారస్వతకార్యములందుఁగూడఁ బ్రాకినవి. ఈపుట్టిమునక మీవలనఁగలిగినది.

నన్న—అయ్యయ్యో! మాకట్టిభేదము లేదే.

నేను—మీకులేనివి మీతరువాతవారికుండఁగూడదా? మీ

కించుగాగమయతియున్నదా? తీసిక, కొట్టిక, యని మీరు ప్రయోగించి యెఱుఁగుదురా? రేఫశకటరేఫములకు మైత్రి మీరంతగా నంగీకరించితిరా! ఇప్పటివా రవి పాటించుచున్నారా? లేదా? అట్లే మతములోఁగూడ మీకు లేని భేదము లిప్పుడు కలిగినవి. వైదికుఁడైన నన్నయగారినినియోగియని పిలుచుటకు నియోగులుదేవులాడుచున్నారు. అట్లుచేయుట మీయందు భక్తిచేతనేయగును. కాని యన్యోన్యవైరము ప్రధానకారణమైయున్నది. నియోగులలో నిరక్షరకుక్షులయినను వైదికుఁడైన నన్నయభట్టుగారిని సామాన్యకవియని తూలనాడుచున్నారు. వైదికులలోఁ బ్రథమానందవాచకపుస్తకమును జదువనివాఁడైనఁ దిక్కనసోమయాజిగారికవిత్వములో రసము లేదని యధిక్షేపించుచున్నాఁడు. ఇంతవఱ కంతవిచారముగా లేదుకాని విమర్శకులు సంపాదింపనున్న నూతనగ్రంథజాలముల కర్తృత్వము నిర్ణయించుటలో నీమతవైషమ్యప్రాబల్యము కొంతవ్యత్యాసమును నిఁక ముందుఁ గలుగఁ జేయునేమో యని నేను భయపడుచున్నాను. కవులారా! నేను నిపుణముగా మాటలాడుశక్తిగలవాఁడనుగాను. నాయభిప్రాయము మీకు స్పష్టమైనదా? లేదా?

తిక్క—తెలిసినది. వైదికుఁ డొనర్చిన గ్రంథమును నియోగి రచియించినదనియు, నియోగి చేసిన గ్రంథమును వైదికుఁ డొనర్చె ననియు, నిఁకముందు చెప్పుదురేమోయని.

నన్న—అది యెట్లు సాధ్యమగును?.

తిక్క—తాళపత్రగ్రంథములలో గ్రంథకర్తృవంశావతారవర్ణనఘట్టము లాగివేయుట యీయింద్రజాలమునకుఁ బ్రథమావస్థ.

నన్న—అట్టి మోస మెంతకాలము దాగును? ఆభయ మక్కఱలేదుకాని—రామనాథరావూ! అయ్యయ్యో! బ్రాహ్మణులలో

నిట్టి వైరములు ప్రబలుచున్నవా?

నేను——వారుపేరనవలదు. అందఱిలోను వైరములు ప్రబలముగా నున్నవి. దినదినప్రవర్ధమానములై యున్నవి. కుమ్ములాట గుద్దులాట తప్ప వేఱుపనియే లేదు.

తిక్క——ఇది మిగుల శోచనీయముకదా! మాధ్వులేమి? నియోగులేమి? వైష్ణవులేమి? వైదికులేమి? అందఱుకూడ వైదికమతావలంబులే కాదా? ఈవైరములు చాలఁ దప్పుగానున్నవే. మాకాలమున నిట్లే యుండెనా?

నేను——కవులారా! ఈ జాతివైషమ్యములఁగూర్చి నే నొక మూఁడు గీతపద్యములను వ్రాసితిని. విందురా?

తిక్క——నీవు పండితుఁడవువలెఁ గానఁబడుటలేదు. కవిత్వ మెట్లు చెప్పుచుంటివి?

నేను——ఇప్పటి కవిత్వాలవారి కెవ్వరికిఁ బాండిత్య మున్నమాట పనికిరాదు. అది లేకపోయినప్పుడే యిది.

నన్న——నాయనా! చదువును పాండిత్యమున కెక్కడికి?

నేను—గీ. తెల్లనుద్దకుమఱి విభూ • తికినిబడదు
నుద్దముక్కల రెంటికిఁ • జుక్కయెదురు
పగిలినవిభూతిపండులోఁ • బ్రబలతరము
లైన తెగల రెంటికిని ష • ష్టాష్టకంబు.
బొగ్గుదారిబొగ్గుది • నుద్దబూడిదలకు
దానికెప్పుడు నైధన • తారవరుస
అరవలకునాంధ్రులకుగుద్దు • లాటధాటి
పైఁగబ్రాహ్మణాబ్రాహ్మణ • భండనంబు.

ఇది మొమనజాతిరీతి నో • రెత్త సిగ్గు
తలకునొక్కొక్కమతమన్నఁ • దప్పుగాదు
తలకుమూడేసితత్త్వము • లత్తలఁపులోన
నొకటి, మాటనొకటి, చేష్ట • నొకటి, యకట!

తిక్క—ఇదేమికవిత్వమోయి! ఇదొక క్రొత్తధోరణిగనున్న దేమి? అదిగాక శుభప్రదమైన కవిత్వములో బూడిదయేమి? బొగ్గేమి? సుద్దయేమి? నైధనతారయేమి? నాపిండకూడేమి? మొత్తుకొన్నట్లేయున్నది.

నేను—ఇంతకంటె మొత్తుకోఁదగిన కవిత్వము మఱియొకటి యున్నది. అది మీరు వినకపోవుటచేత నిట్లనుచున్నారు.

తిక్క—అదేమి? అదేమి?

నేను—నవ్యకవిత్వమని సరిక్రొత్తకవిత్వ మొక్కటి బయలుదేరినది.

నన్న—అది యెక్కడినుండివచ్చినది?

నేను—అది తూర్పుగాలితో వచ్చిన తుపాను. ఏమిచెప్పుదును తాతగారూ! యతులులేవు. ప్రాసలులేవు. సంధులులేవు. ఛందస్సులులేవు. శబ్దశుద్ధిలేదు.—చిట్టిచిట్టిపాటలు--పొట్టిపొట్టిపల్లవులు--పోనీ గానమర్యాదనుజూతమన్న తాళము ధ్వస్తము. రాగము సంకరము.

నన్న—నాయనా! తూర్పని తుపానని చెప్పినావు. మాకేమియు బోధపడలేదు.

నేను—తూర్పుదేశమున నొక్కమహానుభావులు, ఋషివంటివారు, భక్తులు, గానప్రియులు, కవిత్వధోరణిగలవారు కవిత్వము, గానము, మతము, కలిపి గ్రామ్యాగ్రామ్యభేదము గణింపకుండఁ గొన్ని గీతములు పాడినారఁట. ఆయన మహానుభావుఁడని యాంగ్లేయ

ప్రభువులా మోదించిరి.. అటుపైన మనవారందఱు కన్నులు తెఱచి పూర్వపు ధోరణులు,-అనఁగా మీధోరణులు-మాని వైచియాకొత్త పుంతలోఁ బడి గిజగిజ కొట్టుకొనుచున్నారు.అర్థము విడకపోవుటచేతఁ బాఠకులను గిజగిజకొట్టుకొనఁజేయుచున్నారు.

తిక్క—రచియించినవారికైన నర్థము తెలియునుగదా?

నేను—ఆనంగతి మీరడిగితిరి కావునఁ జెప్పవలసివచ్చినది. ఆప్రశ్నము నొకరిదివఱకే యడుగఁ గవితానమాధినిష్ఠావటిష్ఠతలో నేమి చెప్పితిమోకాని యిప్పుడు మేముగూడ దాని కర్థము చెప్పలేమని యవతలివారనిరఁట!

తిక్క—రామనాథరావూ! నవ్యకవిత్వమున నేనైన నొకటి రెండుగీతములుకాని పాటలుకాని పాడఁగలవా?

నేను—నాకు రావు.

తిక్క—నీవు దాని నెప్పుడు చూడకయే యుంటివా!

నేను—చూచితిని. నాకు జ్ఞప్తిలేదు.

తిక్క—జ్ఞప్తిలేకపోవచ్చునులే. ఇదిగో! ఈమచ్చుగానుండునని యొకటిరెండుపాదములు కవిత్వ మెఱిఁగినవాఁడవు చెప్పలేకపోదువా!

నేను—చిత్తము. ప్రయత్నింతును.

గీ. చెంబుపైచుక్క అప్పున • జారిపడఁగ
చిలుకఱులుకుచు దిశలతో • నేకమయ్యె.

కవులారా! వారి ధోరణిని నేను జెప్పలేను.

తిక్క—ఏలాగు? ఏలాగు? దానికర్థమున్నదా?

నేను—ఇందులోనున్న సొగసేయది. చెంబు—అనఁగా ఘటము. ఘటమనఁగా నీశరీరము; చుక్కయనునప్పుడు తేజస్స్వంతమైన

పరమాత్మ చెంబుపైఁ జిక్కి అప్పున జారిపడఁగ ననఁగా మను జునకు భగవత్కటాక్షము కలిగినప్పుడని యర్థము. చిలుకకులుకుచు చిశలతో నేకమయ్యె ననఁగా భక్తిచే నార్ద్రమై జీవాత్మ పరమాత్మలో నైక్యమైనదని భావము.

తిక్క—విషయనిగరణమని యింతకంటెసందర్భముగల కవిత్వము స్వల్పముగా మనలో నున్నదే. ఇది నవ్యకవిత్వ మెట్లగును? సరేకాని యేది యొక్కపాట.

నేను—‘సరసగీతము’ పాడుదునా? కృష్ణుఁడితరగోపికలయొద్దనుండి రాధయొద్దకు వచ్చెను. ఆగోపిక లాతనిచేతికి మల్లెదండను గట్టిరి. అది రాధ క్రీఁగంటఁ జూచెను. కృష్ణుఁడాచేతిని వెనుక నిడుకొనెను. ఈఘట్టమునుండి రసగీతమారంభము.

కుడిదగుచేతిని వెనుకకు నిడుకొన నేలర కృష్ణా
ప్రియసతి యేమనుకొనకుము వీఁపుమీఁదతామరేరాధా.

తిక్క—చాలుచాలు! ఇఁకఁబాడకు. హుఁ! ఇదికూడ నవ్యకవిత్వముకాదే. జయదేవునిగీతగోవిందాదులలో నీమాదిరి దివ్యకవిత్వమున్నదే.

బిలహరి—ఆది.

జయదేవగోవింద జయదేవమాధవా
జయసర్వజగదీశ జయభక్తవరదా
జయరమారమణకాంచనచేలహరిహరీ॥ జయ॥

అమృతప్రవాహసన్నిభమైన యీగానము చెవిఁబడునరి కా మహాకవులు చేతులుజోడించుకొని యట్టెలేచి “ఆహా! నారదమహాముని వైకుంఠమునుండి వేంచేయుచున్నాఁడుకాఁబోలు. ఓన్నమోనారాయణాయ” యని బిగ్గఱగఁ బ్రార్థించిరి. నాకు తేవవలెనని బుది

యున్నను లేచుటకేమో శక్తి లేకపోయినట్లుండెను. నిల్వుగుడ్లువైచుకొని నోరు తెఱచుకొని కవులవంకఁ జూచుచుంటిని. మెఱపుమెఱయునంతవేగమున నాకవి మొదట నీతనిలోఁ గలిసెనో యీకవి యాతనిలోఁ గలిసెనో కాని యిద్దఱుగలిసి చేయియెత్తుస్ఫటికలింగముగా మారిరి. ఈవింతచూచునరికిఁ గొయ్యయైపోయితిని. లోపల నేమూలనో చచ్చిచావకుండ మనస్సున్నదికావున "ఆహా! నియోగులేమి? వైదికులేమి? అందఱాశివస్వరూపములే కాఁబోలునని యనుకొంటినేమో! నారాయణమంత్రముజపించుటతోడనే శంకరుఁడు ప్రత్యక్షమగుటచే శివకేశవులకుఁగూడ భేదములేదనుకొంటినికాఁబోలు. ఇంతలో నెవ్వరోవచ్చి శంకరసన్నిధానమున నేనుగూరుచుండి లేవలేదనుకోపముచేతనో మహాలింగాభిషేకమందలియాసక్తిచేతనో మహాదేవశంభూయని యుచ్చైస్స్వరమునఁబలుకుచుఁ గొబ్బరకాయ యొక్కటి "ఫర్లాంగు" దూయివలెఁ గూర్చుండిన నాతలపై బల్లునఁ బగులఁగొట్టెను. హరహరా! యని యొక్కచావుకేక వైచిలేచితిని. ఇక్కడికి స్వప్నముసరి.

× × × ×

లేచిగడగడవడకుచుంటిని. నోటివెంట మాటలేదు. కంటివెంటఁ జూపుకూడలేదేమో—శి—శి—శివా—వా--వాయని లోన గొణుగుకొంటిని. మొగమువెంట నొడలివెంట నీరుగారుచున్నది. అయ్యయ్యో! నిజముగాఁ గొబ్బరకాయ తలపైఁబగిలినదికాఁబోలునని తల తడిమిచూచుకొనఁగఁ గణతపైఁ బెద్దయుసిరికకాయయంత బొప్పియున్నది. అయ్యయ్యో! యని మఱింత సంభ్రమపడితిని. కాని మనస్సును గొంతకుదురుపఱచుకొనఁ బ్రయత్నించితిని. కొంతసేపటి కెదుటియాముదపు దీప మగపడినది, ఆఁ! ఇక్కడకుఁ దిరుగ మనుజ

లలోఁ బడితినిగదా యని యూహించి యీదెబ్బకుఁ గారణ మేమని యోజించితిని. ఇప్పటివఱకు నాకు యథార్థకారణము తెలియలేదు. ఒకకారణమై యుండునేమో యని యూహించితిని. మొదటిప్రక్కపైఁ జీమకుట్టువలన నిద్రపట్టకపోవుటచేఁ దుంగచాఁప వైచుకొనినప్పుడు తలగడపైఁ గూడఁ జీమయుండునేమో యని యెంచి వాల్మీకి రామాయణకోశమును దలక్రిందఁ బెట్టుకొని పండుకొంటిని. అది కఠినముగా నుంటచేఁ దల కెంతయొత్తుడై ననిచ్చినది. అదికాక నిద్రలో నొత్తిగిలునప్పుడు తల పుస్తకముపైనుండిజాఱి చాఁపయున్న నేలపైఁ బడియుండును. అందువలన బొప్పికట్టినదని యనుకొంటిని.ఇంతకంటెఁ దగినకారణమును నేను చెప్పఁజాలను. కాలుసేతులు గడుగుకొని స్వప్నమంతయు నామూలాగ్రముగ జ్ఞప్తిలోనికిఁ దెచ్చుకొని యిది నా మిత్రునిచే వ్రాయించి ప్రచురింపింతునని యూహించితిని.

స్వప్నకావ్యమున నేకాధ్యాయము.

సంపూర్ణము. శ్రీ శ్రీ శ్రీ

ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః.